




ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి



స్టేజీని సిద్ధం చేస్తున్న సిబ్బంది

వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు 78వ స్వాతంత్ర్య దినోత్సవం
- వేదికగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం
- పతాకాన్ని ఎగురవేయనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 14 : 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రజలు వేడుకలను వీక్షించేలా షామియానాలు, కుర్చీలు, తాగునీటి వసతి కల్పించారు. ఉదయం 9.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం ఆయన జిల్లా అభివృద్ధిపై సందేశాన్ని వినిపించనున్నారు. ఆ తర్వాత శకటాల ప్రదర్శన, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ మనుచౌదరి అధికారులతో కలిసి పరిశీలించారు. ఏ ఒక్కరికీ కూడా అసౌకర్యం కలగకుండా ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సదానందం, డీఆర్డీఏ పీడీ జయదేవ్‌ఆర్యా, ఏఈ ఐఅండ్‌పీఆర్ తిరుపతినాయక్, అర్బన్ తహసీల్దార్ సలీం, మున్సిపల్ కమిషనర్ ప్రేరణ, పలువురు ఉన్నారు.



పట్టణంలో సందడి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో పలు దుకాణాల వద్ద సందడి నెలకొన్నది. విద్యార్థులు జాతీయ జెండాలను, యువతులు జాతీయజెండాను పోలిన గాజులు, బ్యాండ్‌లను కొనుగోలు చేశారు.



జాతీయ జెండాలను కొనుగోలు చేస్తున్న చిన్నారులు



ఓ దుకాణంలో కొనుగోలుదారుల సందడి



రుణమాఫీకి సంబంధించిన కీలక ఘట్టానికి మరికొద్ది సమయమే మిగిలి ఉంది. ఈరోజు మధ్యాహ్నం 12 గంటల తర్వాత లక్షన్నర నుంచి 2లక్షల వరకు రుణమాఫీ జరగనున్నది. రైతుల ఖాతాల్లో నగదును జమ చేయనున్నారు. గత రెండు దఫాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 2.29 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలిగింది. దాదాపు రూ.1659 కోట్ల వరకు మాఫీ డబ్బును రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుత జాబితాలోనూ మరో లక్ష మంది వరకు ఉంటారని అంచనా.



పేరుందా..లేదా...!

రుణమాఫీపై ఉత్కంఠ

- నేడు రూ.2 లక్షల్లోపు మాఫీ
- ఇప్పటికే రెండు విడతలు పూర్తి
- ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్ష మందికి చేకూరనున్న ప్రయోజనం
- రూ.2లక్షలు పైబడిన వారిలో అయోమయం
- తుది జాబితాను బయటపెట్టని అధికారులు
- ఆశావహుల్లో తర్జనభర్జన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు 14 : ఆఖరి విడతగా రూ.2లక్షలలోపు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే తొలి, రెండో విడతల్లో లక్ష, లక్షన్నర రుణాలు పొందినవారికి మాఫీ జరిగింది. ప్రస్తుతం 2 లక్షల వరకు రుణం తీసుకున్నవారికి ప్రయోజనం చేకూరనున్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇదే తుది విడత కావడంతో రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రెండు విడతల లబ్ధిదారుల జాబితాను ఒకరోజు ముందుగానే ప్రకటించారు. కానీ ఆఖరి విడతకు సంబంధించిన జాబితాపై తాత్సారం చేశారు. దాదాపు లక్ష మందికి ప్రయోజనం చేకూరనుంది.

తుది జాబితాపై ఆచితూచి..

జూలై 18వ తేదీన తొలి విడతగా రైతులకు రుణమాఫీ చేశారు. లక్ష వరకు రుణం పొందినవారందరికీ ప్రయోజనం కలిగింది. కాగా రెండ్రోజుల ముందుగానే లబ్ధిదారుల జాబితాను బయటపెట్టారు. ఎవరెవరికి మాఫీ జరుగుతోందననే విషయం తేటతెల్లమైంది. జూలై 30వ తేదీన రెండో విడతగా రూ.లక్షన్నర వరకు మాఫీ చేశారు. దీనికి సంబంధించిన జాబితా కూడా ఒక రోజు ముందుగానే బయటపడింది. కానీ ఆగస్టు 15కు సంబంధించిన ఆఖరి జాబితాపై అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ఆచితూచి వ్యవహరించినట్లుగా కనిపిస్తోంది. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు సంబంధించి లబ్ధిదారుల సంఖ్యపై వ్యవసాయాధికారులు, లీడ్ బ్యాంక్ అధికారులు దాటవేసే ప్రయత్నం చేశారు. తమకు సమాచారం రాలేదని అన్నారు. రాత్రి 7 గంటల వరకు కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది.

విడతల వారీగా లబ్ధిపొందిన రైతులు, ఎన్ని కోట్లంటే..

జిల్లా	మొదటి విడత రైతులు	మాఫీ(కోట్లల్లో)	రెండో విడత	మాఫీ
సంగారెడ్డి	51,167	279.62	27,249	286.79
మెదక్	47,968	238.81	21,517	202.98
సిద్దిపేట	53,129	291.21	27,955	279.33
మొత్తం	1,52,264	889.83	76,721	769.10

అయోమయంలో రైతులు

రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందన్న ఆనందం కంటే జాబితాలో తమ పేరుందో.. లేదోననే ఉత్కంఠే రైతులను ఊపిరి బిగపట్టేలా చేసింది. లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న రైతుల సంఖ్య కంటే రూ.2 లక్షలపైన రుణం పొందినవారి సంఖ్యనే మూడింతలు ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే రూ.2 లక్షల పైబడిన రుణం, వడ్డీని ముందుగా చెల్లిస్తేనే తుదిజాబితాలో పేరుంటుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కొంత మంది రూ.2 లక్షలపైనున్న రుణాన్ని చెల్లించారు. ఇంకొందరేమో ప్రభుత్వమే రూ.2 లక్షలు చెల్లిస్తే మిగతా మొత్తాన్ని తర్వాత చెల్లిస్తామనే ధీమాతో ఉన్నారు. అదే విధంగా రూ.3 లక్షల పైచిలుకు రుణాన్ని పొందినవారూ లేకపోలేదు. ఇలాంటి రైతులు కూడా తమ రుణమాఫీపై అయోమయంతోనే కనిపిస్తున్నారు. 3 లక్షలకు పైగా రుణం ఉంటే ఇప్పటికిప్పుడు మిగతా లక్ష రూపాయలు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలనే పలువురు ప్రశ్నిస్తున్నారు. ముందుగా రూ.2 లక్షలు మాఫీ చేయాలని పట్టుబడుతున్నారు.

కలెక్టర్ వద్దకు 'కుర్చీ' పంచాయితీ

- డీఐఈవోగా హిమబిందు కొనసాగింపు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు 14: ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులతో ఒకరు.. హైకోర్టు ఉత్తర్వులతో ఇంకొకరు డీఐఈవో పోస్టులో కొనసాగడంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ మనుచౌదరి స్పందించారు. 'నేనంటే నేను' శీర్షికన ప్రచురితమైన ఈ కథనం జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో కలెక్టర్ బుధవారం ఉదయాన్నే ఇద్దరు అధికారులను పిలిపించారు. కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న రవీందర్‌రెడ్డిని సిద్దిపేట జిల్లా ఇంటర్ విద్యాధికారిగా నియమిస్తూ ఆ విభాగం రాష్ట్ర డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను కలెక్టర్ పరిశీలించారు. అదే విధంగా జూలై 1 నుంచి జిల్లా ఇంటర్ విద్యాధికారిగా కొనసాగుతున్న హిమబిందుకు తాజాగా హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులను సైతం పరిశీలించారు. హైకోర్టు తుది తీర్పు వచ్చే వరకు యథాస్థితి ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొనడంతో హిమబిందునే కొనసాగించాలని అన్నట్లుగా తెలిసింది. దీంతో ఆమె బుధవారం తన కార్యాలయానికి వెళ్లి విధులు నిర్వహించారు. దీనిపై రవీందర్‌రెడ్డి సైతం ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి విషయాన్ని వివరించినట్లు సమాచారం. కోర్టు నుంచి తుది తీర్పు వెలువడితేనే ఈ సస్పెన్స్‌కు ముగింపు పలికినట్లవుతుంది.

బంగ్లాదేశ్ ఘటనలపై మేధావుల స్పందనేది?

- దాడులు జరుగుతున్నా స్పందించరా?
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, ఆగస్టు 14: బంగ్లాదేశ్ ఘటనలపై మేధావులు ఎందుకు స్పందించడం లేదని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. గజ్వేల్‌లోని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన తిరంగా ర్యాలీలో ఆయన ముఖ్య అతిథితిగా హాజరై మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నా భారతదేశంలోని మేధావులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దేశంలో చిన్న సంఘటన జరగక ముందే స్పందించే మేధావులు ఖండించకుండా మౌనం పాటించడాన్ని ఏమనుకోవాలని ఆయన ప్రశ్నించారు. గజ్వేల్ లాంటి పట్టణంలో ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి పట్టణాన్ని బంద్ చేశారంటే ప్రజల నుంచి వస్తున్న సంఘటితాన్ని అర్థం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై తిరంగా జెండాను ఎగురవేయాలన్నారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు మాదాడి జశ్వంత్‌రెడ్డి, యెల్లు రాంరెడ్డి, గురువారెడ్డి, సింగం సత్తయ్య సురేశ్‌గౌడ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, నాయకులు సురేశ్, బండారి మహేశ్, మామిండ్ల నాగుముదిరాజ్, నాయిని సందీప్, భాస్కర్‌రెడ్డి, ఉమ, కుంకుమరాణి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

త్రిబుల్‌ఆర్‌తో భాగ్యనగరం దశ, దిశ మారడం ఖాయం

త్రిబుల్‌ఆర్‌తో భాగ్యనగరం దశ, దిశ మారడం ఖాయమని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్‌లోని నేషనల్ హైవే అథారిటీ కార్యాలయంలో త్రిబుల్‌ఆర్ పీడీ, అధికారులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించిన అనంతరం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం కంకణంబద్ధులై పనిచేస్తుందన్నారు. మోదీ ప్రభుత్వంలో అనేక రోడ్లు జాతీయ రహదారులుగా మార్చామని తెలిపారు. ఇక రీజనల్ రింగ్‌రోడ్డును యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని నిర్ణయించామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తనవంతుగా కలసి వస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డుపై ఏవైనా అపోహలు ఉంటే స్థానిక కలెక్టర్లను కలవాలని, లేదా తననైనా సంప్రదించవచ్చన్నారు.



తిరంగా ర్యాలీలో విద్యార్థులతో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తాం

- బీడు భూములు లేకుండా చేయడమే లక్ష్యం..
- నిరుద్యోగులకు వ్యవసాయ ఆధారిత పథకాల మంజూరుకు కృషి
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 14 : హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగునీరందించి బీడు భూములనేవి లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు దేవాదుల నుంచి, చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు మిడ్ మానేరు నుంచి, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు గౌరవెల్లి రిజర్వాయర్ ద్వారా ప్రతీ ఎకరాకు సాగునీరందించనున్నామన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయంతో పాటు వాటి అనుబంధ రంగాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. సాగుకు యోగ్యం కాని భూముల్లో కూడా ఆయిల్‌పాం తోటలు వంటివి పెట్టించి రైతులకు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఉద్యోగం రాలేదని బాధపడకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ల, చేపల పెంపకం, గొర్లు, మేకల పెంపకం చేపట్టడానికి నిరుద్యోగులకు ప్రభుత్వం నుంచి రుణా లు అందించేందుకు కృషి చేస్తామని, ఇందుకు పూర్తి బాధ్యత తీసుకుంటామని వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి, టూరిజం రంగాలను సమతుల్యంగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం తెలిపారు. గౌరవెల్లి రిజర్వాయర్ కాలువ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, మహాసముద్రం గండి ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు. హుస్నాబాద్‌ను సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామని, అందులో కొన్నింటికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని చెప్పారు.



ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని అందించేందుకు రూపొందించిన మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

లోటు.. పంటలకు చేటు

- ఐదు మండలాల్లో తక్కువ వర్షపాతం
- జిల్లాలో విస్తారంగా కురవని వానలు
- ముందుకు సాగని సాగు
- ఆందోళనలో రైతాంగం

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 14: వర్షాకాలం ప్రారంభమై రెండునెలలు గడిచినా జిల్లాలో సరైన వానలు కురవడం లేదు. జిల్లాలోని ఐదు మండలాల్లో లోటు వర్షపాతం నమోదుకావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాగు చేసిన పంటలు చేతికందుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 5.22 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 4.30 లక్షల ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. 3.79 లక్షల ఎకరాల వరి సాగవుతుందని అంచనా వేసినా ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. మరో 50 వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశాలున్నాయి. అయితే, సాగునీరు లేకపోవడం వల్ల చాలా చోట్ల నాట్లు పడలేదు. మరోవైపు ఎండలు విపరీతంగా ఉన్నాయి. వానలు కురవక, భూగర్భజలాలు వరి నారు ముదిరిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో మొత్తం 26 మండలాలు ఉన్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 13 వరకు 363.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 392.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 8 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా, 13 మండలాలలో సాధారణ వర్షపాతం నమోదైంది. వర్గల్ ములుగు, మర్కుక్, జగదేవ్‌పూర్, కొమురవెల్లి మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. వర్గల్‌లో 373.7 మిల్లీమీటర్ల నమోదు కావాల్సి ఉండగా 279.4 మిల్లీమీటర్లు నమోదైంది. 27.6శాతం లోటు వర్షపాతం నమోదైంది. మర్కుక్‌లో 378.8 మిల్లీమీటర్లకు 219.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 41.మిల్లిమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. జగదేవ్‌పూర్‌లో 352.4 మిల్లీమీటర్లకు 277.3 మిల్లిమీటర్లు పడింది. 21.3 లోటు వర్షపాతం నమోదైంది. కొమురవెల్లిలో 355.1 మిల్లీమీటర్లకు 242.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 31.7 మిల్లిమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. దీంతో బోరు బావుల మీద ఆధారపడి పంటలు సాగుచేస్తున్న రైతులూ ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు చివరి వరకు వరినాట్లు వేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులన్నింటినీ నింపి కాలువల ద్వారా నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



నాట్లు వేస్తున్న మహిళలు

సిద్దిపేట జీజీహెచ్ ఎదుట జూడాల ధర్నా

- హత్యాచార నిందితులను శిక్షించాలని డిమాండ్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 14 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీకార్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, పలువురు జూనియర్ వైద్యులు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాల ఎదుట జూనియర్ డాక్టర్లు, హౌజ్ సర్జన్‌లు, జూనియర్ డాక్టర్లు, పోస్టు గ్రాడ్యుయేట్లతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, జూనియర్ డాక్టర్లు మాట్లాడారు. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ప్రతీ వైద్య కళాశాలలో, ఆసుపత్రిలో వైద్యులకు రక్షణ విషయంలో మరింత మెరుగుపర్చాలని, కనీస సదుపాయాలు, డాక్టర్లకు డ్యూటీ రూమ్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ధరణి, డాక్టర్ నితీష్, డాక్టర్ అజయ్‌ప్రకాష్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.



జీజీహెచ్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

అమృత్ 2.0తో తీరనున్న తాగునీటి సమస్య 8

- రూ.10 కోట్ల నిధులు మంజూరు
- అదనంగా 2వేల లీటర్ల తాగునీరు అందుబాటులోకి
- సుమారు 8 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ పనులు

ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశాభివృద్ధి 7

- విచ్ఛిన్నం, విధ్వంసాలతో దేశాల అభివృద్ధి అసాధ్యం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కేజీబీవీ సిబ్బందికి టైం స్కేల్ వర్తింపజేయాలి: తపస్

చేగుంట ఆగస్టు 12: కేజీబీవీ పాఠశాలల్లో దీర్ఘ కాలంగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేసున్న బోధన, బోధనేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) వర్తింపచేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తపస్ చేగుంట మండలశాఖ అధ్యర్యంలో మండలంలోని పోలంపల్లి, ఆదర్శ పాఠశాల, వడియారం, కేజీబీవీ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు ఉన్నత విద్యార్హతలు కలిగి అర్హత పరీక్షలో మెరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఎంపికైన కొన్సేళ్లుగా పనిచేస్తున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలు, పీజీ సీఆర్‌టీలు, బోధనేతర సిబ్బంది తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలంటూ పలు డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, తపస్ మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, ఉపాధ్యాయులు అమరేశ్వరి, బక్కప్ప, శ్రీనివాస్, పద్మ, సునిత, సునితాహెలెన్, సిద్దిరాములు, వసంత తదితరులు పాల్గొన్నారు

ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశాభివృద్ధి

- విచ్ఛిన్నం, విధ్వంసాలతో దేశాల అభివృద్ధి అసాధ్యం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

జహీరాబాద్/ఝరాసంగం, ఆగస్టు 14: ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలోనే దేశాభివృద్ధి సాధ్యమైతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. విభజన గాయాల స్మారక దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో పలువురు సంఘసేవకులు, తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఒక్కప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండగా, నేడు మోదీ నేతృత్వంలో 5వ స్థానానికి చేరుకుందన్నారు. 3 స్థానంలో దేశ ఆర్థికవ్యవస్థను నిలిపేవిధంగా ప్రధానమంత్రి మోదీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భారతదేశ ఆర్థికమూలాలు నేడు గ్రామాల్లో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ప్రపంచదేశాలకు మన భారతదేశం ఆదర్శంగా ఉందంటే అది మోదీకే సాధ్యమైందన్నారు. ప్రపంచదేశాలకు ఆహారం, వ్యాక్సిన్ తదితరాలను అందించి దేశకీర్తిని ప్రపంచపటల్లోకి ఎక్కించిన గొప్పవ్యక్తి మోదీయేనని ఆయన స్పష్టం చేశారు. విచ్ఛిన్నం, విధ్వంసాలతో దేశాల అభివృద్ధి అసాధ్యమేనని ఆయన తెలిపారు. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, నేపాల్, ఇరాన్, ఇరాక్, బంగ్లాదేశ్, తదితర దేశాలు వివిధ కారణాలతో విచ్ఛిన్నం, విధ్వంసాలకు గురయ్యాయని చెప్పారు. భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం మనపై ఎంతగానో ఉన్నదని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం అమరులు చేసిన సేవలను స్మరించుకుందామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, ఎడ్ల రమేష్, శ్రీనివాస్‌గుప్తా, మల్లికార్జున్, గొల్లభాస్కర్, సుభాష్‌రెడ్డి, రాజ్‌కుమార్ దేశ్‌పాండే, నౌబాద్ జగన్, బక్కయ్యగుప్తా పాల్గొన్నారు. అనంతరం బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమానికి వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ పూజలు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


సమావేశంలో మాట్లాడుతున్న రాణి రుద్రమ

చరిత్రలో మర్చిపోలేని అమానుష ఘట్టం దేశ విభజన

సిద్దిపేట క్రైం, ఆగస్టు 14: భారతదేశ చరిత్రలో మర్చిపోలేని అమానుష ఘట్టం దేశ విభజన అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని శివానుభవ మండపంలో దేశ విభజన మాయని గాయాలు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 1947లో జరిగిన దేశ విభజన చరిత్రలో ఒక అమానుష, అమానవీయ అధ్యాయమన్నారు. నెహ్రూ ప్రధాని కావడం కోసం అఖండ భారత్‌ను విడగొట్టారని విమర్శించారు. విభజన కారణంగా చెలరేగిన హింస, ద్వేషం లక్షలాదిమంది ప్రజల ప్రాణాలను బలిగొందని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబటి బాలేష్‌గౌడ్, విభీషణ్‌రెడ్డి, కానుగంటి శ్రీనివాస్, బొంగోని సురేష్‌గౌడ్, తోకల ఉమారాణి, బూరుగు సురేష్‌గౌడ్, ఉపేందర్‌రావు, కోడూరి నరేష్, గోనె మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి వదిలి వెళ్లిందని యువకుడి ఆత్మహత్య


ఆంజనేయులు (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 14: ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు నచ్చజెప్పడంతో తిరిగి తల్లి గారింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కంచన్‌పల్లిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన చౌదరిపేట ఆంజనేయులు(22) చేగుట మండలం వడియారం గ్రామానికి చెందిన ఓ అమ్మాయి ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను పెద్దలు కాదనడంలో పదిహేను రోజుల క్రితం పెద్దలను ఎదరించి పెళ్లి చేసుకున్నారు. అయితే, ఇరు కుటుంబాల వారు పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నారు. అయితే, అమ్మాయి తల్లిదండ్రులు తమ కూమార్తెకు నచ్చజెప్పడంతో ఆమె తిరిగి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంఇన ఆంజనేయులు బుధవారం ఉదయం పొలం దగ్గరకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో, ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో పొలం వద్దకు వెళ్లగా.. అక్కడ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి


యాదగిరి మృతదేహం

వర్గల్, ఆగస్టు 14: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. వర్గల్ మండలం మాదారం గ్రామానికి చెందిన మోత్రే యాదగిరి(45) మంగళవారం మధ్యాహ్నం చేపల వేటకు గాలం తీసుకుని శివారు ప్రాంతంలోని ఐలేని చెరువు వద్దకెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి గాలించగా.. రాత్రి 11 గంటలకు యాదగిరి మృతదేహం లభ్యమైంది. బుధవారం మృతుడి తండ్రి రాంచంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పటాన్‌చెరులో ఫ్లై ఓవర్ ప్రతిపాదన

- ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి జాతీయ రహదారిని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 14: జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించే పనులు చురుగ్గా సాగుతున్నాయని, పటాన్‌చెరు పట్టణంలో ప్రజలకు, చిరు వ్యాపారులకు ఇబ్బంది కలుగకుండా ఫ్లై ఓవర్ ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి చెప్పారు. బుధవారం పటాన్‌చెరులో జాతీయ రహదారిలో విస్తరణ పనులు, ట్రాఫిక్ సమస్యను నేరుగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ అతిథి గృహంలో సమీక్ష నిర్వహించారు. పట్టణం మధ్య నుంచి జాతీయ రహదారి వెళ్తున్నందున ఆరు లైన్లుగా విస్తరిస్తే నిత్యం ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని, భూ సేకరణలో పెద్దఎత్తున భూమిని కోల్పోవడం ద్వారా వ్యాపారులు వీధిన పడే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చీఫ్ ఇంజనీర్‌కు వివరించారు. ప్రత్యామ్నాయంగా ఆల్విన్ ఫ్యాక్టరీ నుంచి నవోపాన్ చౌరస్తా వరకు ఫ్లైఓవర్‌ను నిర్మించాలని కోరారు. చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను గుర్తించామన్నారు. త్వరలోనే ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఫ్లై ఓవర్ ప్రతిపాదినను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమీక్షలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సపానాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నాచగిరిలో వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

వర్గల్, ఆగస్టు 14: అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి పవిత్రోత్సవాలు బుధవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వేదపండితుల వేద మంత్రోశ్ఛరణల మధ్య పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో విష్వక్సేనారాధన, స్వస్తి పుణ్యవచనం, రక్షబంధనం, మృత్యంగ్రహనము, అంకురార్పణ, నీరాజనం, మంత్రపుష్పము, తీర్థ ప్రసాదములు వితరణ తదితర పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్.అన్నపూర్ణ పర్యవేక్షణలో పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వేదపండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


ఆలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

విద్యుదాఘాతంతో రైతు మృతి


సంతోష్‌కుమార్ (ఫైల్)

కొండపాక,ఆగస్టు 14: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన రైతు ఖైలారం సంతోష్‌కుమార్‌చారి తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో పొలం దున్నడానికి వెళ్తున్న క్రమంలో విద్యుత్ వైరు ట్రాక్టర్‌కు తగిలి షాక్‌కు గురై, స్పృహ కోల్పోయాడు. వెంటనే పరిసర ప్రాంత రైతులు చూసి సిద్దిపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతిచెందాడు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎద్దుమైలారం జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన జపాన్ బృందం

కంది, ఆగస్టు 14: గ్లోబల్ సైన్స్ క్యాంపస్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ సందర్శనకు వచ్చిన జపాన్ బృందం.. మండల పరిధిలోని ఎద్దుమైలారం జడ్పీహెచ్‌ఎస్‌లో సందడి చేసింది. జపాన్ బృందానికి ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. జపాన్‌లోని షిమనే విశ్వవిద్యాలయం ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మియుకి మత్సుడా, ప్రొఫెసర్లు తత్సుయుకి యమ్మో, హేమంత్ నూతలపాటితో పాటు జపాన్ ఇంటర్మీడియట్ పాఠశాల విద్యార్థులు యుకీ నాగో, అమీకొనిషి, కితాటోమ్‌లు జపాన్ బృందం సందర్శించింది. ఇక్కడి విద్యావిధానంపై ఉపాధ్యాయులను అడిగి తెలుకున్నారు.


జపాన్ బృందానికి స్వాగతం పలుకుతున్న ఎద్దుమైలారం జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట రూరల్, ఆగస్టు 14: అప్పులబాధతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లూరు గ్రామానికి చెందిన కొమ్ము శ్రీనివాస్(43) ఈ నెల 4న సిద్దిపేటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించలేదు. గతంలో కూడా ఇలాగే వెళ్లి తిరిగొచ్చేవాడని కుటుంబీకులు తెలిపారు. ఇదిలా ఉండగా రాఘవాపూర్ శివారులోని పిట్టలవాడ సమీపంలో శ్రీనివాస్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడికి కొన్ని అప్పులు ఉన్నాయని, వాటి గురించి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని తెలిపారు. భార్య తార ఫిర్యాదు మేరకు సిద్దిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


భవాని(ఫైల్)

చిన్నకోడూరు, ఆగస్టు 14: గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని.. చికిత్స పొందుతూ మృతిచెఇందింది. ఎస్‌ఐ బాలకృష్ణ వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్ గ్రామానికి చెందిన పండుగ లచ్చవ్వ, రాజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె భవాని(18) ఉన్నారు. భవాని ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయ్యింది. ఈ విషయాన్ని తరచూ కుటుంబసభ్యులకు చెప్పుకుంటూ బాధపడుతుండేది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన భవాని 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. కొద్దిసేపటికి ఇంట్లోకి వచ్చిన వదిన రేఖకు విషయం చెప్పింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలి తల్లి లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిరసనగండ్లలో ఉచిత వైద్య శిబిరం

కొండపాక, ఆగస్టు 14: కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామంలో కొండపాక ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ రజిని ఆధ్వర్యంలో బుధవారం వృద్ధాప్య ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 ఏళ్లకు పైబడిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వృద్ధులకు సాధారణంగా వచ్చే మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, మధుమేహం, రక్తపోటు, కడుపులో మంట, మలబద్ధకం, జలుబు, దగ్గు, మూత్ర సంబంధమైన వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో పాటు... 129 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఫార్మాసిస్ట్ శివ, డీపీఎంవో భానుతేజ, రమేష్ ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాకు ఫుడ్ సేఫ్టీ అధికారుల నియామకం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14: సంగారెడ్డి జిల్లాకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా(ఏఎఫ్‌సీ) పనిచేస్తున్న అమృతశ్రీకి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక సంగారెడ్డి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీషికా నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లో పనిచేస్తున్న ఆమెకు జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించారు. వీరు వారి హోదాల్లో విధుల్లో చేరారు.


నిందితులను చూపెడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు

వరకట్న వేధింపు కేసులో నిందితుల అరెస్ట్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 14: వరకట్నం కోసం వేధించడంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో నిందితులను చిన్నకోడూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిద్దిపేట ఏసీపీ మధు వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పురా కాలనీకి చెందిన మౌనికకు చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్ గ్రామానికి చెందిన కూన రవితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.3 లక్షల నగదు, ఆరు తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. వీరికి కూతురు(4), కుమారుడు(2) ఉన్నారు. అయితే కొంతకాలంగా మౌనికను అదనపు కట్నంగా మరో రూ.3 లక్షలు తీసుకురావాలని భర్త రవి, అత్త యాదవ్వ వేధిస్తున్నారు. రోజురోజుకూ వేధింపులు ఎక్కువకావడంతో భరించలేక జూలై 28న మౌనిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదేరోజు దహన సంస్కారాలు చేసి సాక్ష్యాలు దొరక్కుండా చచేసేందుకు ప్రయత్నించారు. తన కూతురు మౌనిక మృతిపై అనుమానం ఉన్నదని తల్లి మల్కల మంజుల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సిద్దిపేట ఏసీపీ మధు, రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ, రాజగోపాల్ పాట ఎస్‌ఐ అసిఫ్‌లు కలిసి బుధవారం నిందితులను భర్త రవి, అత్త యాదవ్వను అదుపులోకి తీసుకుని విచారించగా.. నిజాన్ని ఒప్పుకున్నారు. అలాగే దహనం చేసిన స్థలం నుంచి క్లూస్‌టీం సహాయంతో మృతురాలి ఎముకలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్, పోలీసులు

మద్దూరు, ఆగస్టు 14: అక్రమంగా రవాణా చేస్తున్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. మద్దూరు ఎస్‌ఐ షేక్ మహబూబ్ మాట్లాడారు. యాదాద్రి భవనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోతు రాజేష్, గంజి అశోక్ వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జ్వర సర్వే వివరాలను తెలుసుకుంటున్న గరిమా అగ్రవాల్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

దుబ్బాక, ఆగస్టు 14: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని అదనపు కలెక్టర్ గరిమాఅగ్రవాల్ సూచించారు. బుధవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి మాట్లాడారు. ప్రజలు సీజనల్‌వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేవిధంగా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో జ్వర సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆమెవెంట జిల్లా వైద్యాధికారి ఆనంద్, డీఎల్పీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఎంపీని కలిసిన యాదవ సంఘం నాయకులు

చేర్యాల, ఆగస్టు 14: కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు బుధవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 16న గ్రామంలో యాదవసంఘం భవనం ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానపత్రికను అందజేశారు. ఇందులో మాజీ జట్పీడీసీ కొమ్ము నర్సింగరావు, అయిలయ్య ఉన్నారు.

అమృత్ 2.0తో తీరనున్న తాగునీటి సమస్య

- రూ.10 కోట్లు మంజూరు
- అదనంగా 2వేల లీటర్ల తాగునీరు అందుబాటులోకి
- సుమారు 8 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ పనులు



నూతన ట్యాంకు నిర్మించనున్న అంబేడ్కర్ భవన్ ప్రాంతంలోని స్థలం

చేర్యాల, ఆగస్టు 14: అమృత్ 2.0 స్కీంతో చేర్యాల మునిసిపల్ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. పట్టణంలోని 12 వార్డుల్లో 20 వేలకుపైగా జనాభా, 5,933 ఇళ్లు, 4,570 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. నీటి సరఫరాకు 131 పవర్‌బోర్లు, 21 వాటర్ ట్యాంకులు వినియోగిస్తున్నారు. ఒక్కో ఇంటికి 135 ఎల్‌పీసీడీ (లీటర్ పర్ కెపాసిటీ డైలీ) డిమాండ్ ఉండగా, ప్రస్తుతం 70 ఎల్‌పీసీడీ నీటిని మాత్రమే అందిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ ప్రజలకు 2.7 ఎంఎల్‌డీ నీరు అవసరపడతున్నాయి. కానీ అందులో మిషన్ భగీరథ ద్వారా 1.6 ఎంఎల్‌డీ సామర్థ్యం నీరు, 131 పవర్‌బోర్ల ద్వారా 8 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తున్నారు. పట్టణం రోజురోజుకూ విస్తరించడం, పలు వార్డులు, వీధుల్లో పైప్‌లైన్ లేక పలువురు ఇప్పటికీ నల్లా కనెక్షన్ పొందలేదు. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు సరిపడా ట్యాంక్‌లతో పాటు పలు వీధుల్లో నల్లా కనెక్షన్లు లేకపోవడం, పలు ఏరియాల్లో రెండురోజులకోసారి నీటి సరఫరా చేస్తుండటంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు మునిసిపాలిటీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో చేర్యాల మునిసిపాలిటీకి రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కొద్దిరోజుల క్రితం సంబంధిత అధికారులు, మునిసిపల్ అధికారులు కలిసి ఏయే ఏరియాల్లో నీటి సమస్య ఉన్నది. ఎక్కడ వాటర్ ట్యాంక్‌లు నిర్మాణం అవసరం ఉంది.. ఎక్కడ పైప్‌లైన్ ఏర్పాటుచేయాలని సమీక్షించారు. కొత్త బస్టాండ్ వద్ద 1000కేఎల్, మార్కెట్‌యార్డు వద్ద 500కేఎల్, అంబేడ్కర్‌నగర్ కాలనీలోని అంబేడ్కర్ భవన్ ఏరియాలో 500కేఎల్ సామర్థ్యంతో మూడు నూతన వాటర్ ట్యాంకులు నిర్మించేందుకు స్థలాలను ఖరారు చేశారు. అందుకు డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ సుమారు 8 కిలోమీటర్ల మేర చేపట్టాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియ ఇటీవల పూర్తవగా మెగా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ టెండర్ దక్కించుకున్న నేపథ్యంలో ట్యాంకుల నిర్మిత ప్రతిపాదిత ప్రదేశాల్లో జియోగ్రాఫికల్ సర్వేకూడా పూర్తి చేశారు. త్వరగా ట్యాంకుల నిర్మాణం పూర్తిచేస్తే రెండున్నర దశాబ్దాల వరకు ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అధికారులు తెలిపారు. ఈ విషయమై మునిసిపల్ అధికారులు, పాలకమండలి సహా కాంట్రాక్టర్ ఏవిధమైన చర్యలు తీసుకుంటారన్నది వేచిచూడాల్సిందే మరి.

తైబజార్ నిర్వాహకుడిపై దాడి

దుబ్బాక, ఆగస్టు 14: దుబ్బాకలో తైబజార్ పన్నును వసూలు చేస్తున్న నిర్వాహకుడిపై, సిబ్బందిపై స్వీట్‌హోం యజమానురాలు దాడి చేశారు. ఈ విషయమై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. దుబ్బాక పట్టణంలోని బస్టాండ్ వద్ద గల శ్రీబాలాజీ మిఠాయి బండార్ మెట్ల వద్ద మిర్చి, సమోసా బండి నిర్వహిస్తున్నారు. దీనిపై తైబజార్ రుసుం ఇవ్వాలని తైబజార్ నిర్వాహకుడు బావాజీ రమేష్ ఎన్నిసార్లు అడిగినా చెల్లించలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్‌కు మిర్చి, మసాల బండిపై ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బందితో వచ్చిన బావాజీ రమేష్‌తో యజమాని మోహన్‌లాల్, అతని భార్య మోకాదేవితోపాటు మరో వ్యక్తి వాగ్వాదానికి దిగారు. ఇంతలో మోకాదేవి కోపంతో రమేష్‌పై దాడి చేసింది. రమేష్ దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిచేసిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

కుకునూరుపల్లి, ఆగస్టు 14: గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బొబ్బయిపల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను రోజులాగే గ్రామపంచాయతీకి ఎదురుగా నిలిపారు. బుధవారం ఉదయం సిబ్బంది వాహనం వద్దకెళ్లి పరిశీలించగా.. బ్యాటరీ కనిపించలేదు. ఈ విషయాన్ని సెక్రెటరీ రాంప్రసాద్‌కు తెలపగా.. ఆయన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

గజ్వేల్, ఆగస్టు 14: గజ్వేల్ పట్టణంలోని పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించారు. గజ్వేల్ పట్టణ శివారుల్లో పలువురు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించగా, ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.25,460 నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, ఆరు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

పనికిరాని వస్తువులతో గృహోపకరణాలు



విద్యార్థులు తయారుచేసిన గృహోపకరణాలు

కుకునూరుపల్లి, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు వనిత సహకారంతో పనికిరాని వస్తువులతో చాలా తక్కువ ఖర్చుతో గృహోపకరణ, అలంకరణ వస్తువులు తయారు చేశారు. ప్రధానోపాధ్యాయుడు బచ్చలి సత్తయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పరిశీలించి, అభినందించారు.

సమాచారం

'రేషన్‌కార్డులు వెంటనే మంజూరు చేయాలి'

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 14: రేషన్‌కార్డులు వెంటనే మంజూరు చేయాలని బీఎస్పీ సిద్దిపేట అసెంబ్లీ అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డుల కోసం ఉపసంఘం, కమిటీలు అంటూ కాలయాపన చేయొద్దన్నారు. ఎంతోమంది కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మూడుకు చేరిన మృతుల సంఖ్య

రాయపోల్, ఆగస్టు 14: రాయపోల్ మండలం గుర్రాల సోఫా సమీపంలో 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన డీసీఎం డ్రైవర్ రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన వడ్లకొండ రాకేష్(22) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు.

పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట గ్రామాల స్పెషలాఫీసర్‌గా కౌసల్య

చేర్యాల, ఆగస్టు 14: చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట గ్రామాల స్పెషలాఫీసర్‌గా హార్టికల్చర్ ఆఫీసర్ కె.కౌసల్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ రికార్డుల్లో సంతకాలు చేశారు.

రామ్‌సాగర్ గ్రామపంచాయతీ ఏర్పాటుపై సంబరాలు

బెజ్జంకి: మండలంలోని దాచారం అనుబంధ గ్రామమైన రామ్‌సాగర్‌ను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రామ్‌సాగర్ గ్రామస్థులు సంబరాలు జరుపుకొని మిఠాయిలు పంచుకున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

నంగునూరు, ఆగస్టు 14: వివిధ కారణాలతో మృతిచెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను బుధవారం కాంగ్రెస్ నాయకుడు, ఫార్మా ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ గాదగోని చక్రధర్‌గౌడ్ పరామర్శించి, తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నంగునూరు మండలం రాజగోపాల్‌పేట గ్రామానికి చెందిన కాటం రాజయ్య, పాలమాకులలో అనారోగ్యంతో మృతిచెందిన అబ్దుల్ రజాక్,వర్దోలు ఎర్రయ్య కుటుంబాలను పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.10 చొప్పున రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు.

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



బెజ్జంకిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, ఆగస్టు 14: మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సూర్య స్వయం సహాయక సంఘం సభ్యులకు మహిళా శక్తిలో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరసయ్య, సూపరింటెండెంట్ అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, పులి కృష్ణ, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

హుస్నాబాద్, ఆగస్టు 14: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మహిళలకు సూచించారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన టౌన్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాలకు రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజురు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, రాజు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళాశక్తిపై అవగాహన

చేర్యాల, ఆగస్టు 14: ఇందిరా మహిళాశక్తి పథకం అమలుపై చేర్యాల మునిసిపల్ మెప్మా రిసోర్స్ పర్సన్లకు మునిసిపల్ కార్యాలయంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ పీడీ హన్మంతరెడ్డి మాట్లాడారు. మహిళలు ఆసక్తిగల రంగాల్లో వ్యాపారపరంగా అభివృద్ధి చెందేలా బ్యాంకులతో పాటు స్త్రీనిధి ద్వారా రూ.1 నుంచి రూ.5 లక్షల వరకు వ్యక్తిగత రుణం మంజూరు చేయనుందని తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ నాగేందర్, మున్సిపల్ అధికారి కృష్ణ, ఏడీఎంసీ సంతోషిమాత బ్యాంకర్లు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ రికార్డులు స్వాధీనం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో

బెజ్జంకి, ఆగస్టు 14: మండలంలోని దాచారం గ్రామపంచాయతీ రికార్డులను బుధవారం హుస్నాబాద్ డీఎల్పీవో వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారు. దాచారం గ్రామపంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగాయని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ ఆర్టీఐ చట్టం ద్వారా రికార్డుల వెరిఫికేషన్‌కు గతంలో దరఖాస్తు చేశారు. రికార్డుల వెరిఫికేషన్‌కు బుధవారం అనుమతి లభించడంతో సీసీఆర్ సంస్థ సభ్యులు డీఎల్పీవోతో కలిసి గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. సదరు రికార్డులను ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంపీవో మంజుల, సీసీఆర్ సంస్థ సభ్యులు గుండ్ల శివచంద్రం, నెవూరి రత్నాకర్ పాల్గొన్నారు.

దేవాదాయ భూములను ఆక్రమిస్తే సహించం: ఈవో

గజ్వేల్, ఆగస్టు 14: దేవాదాయ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని గజ్వేల్ రామాలయం-శివాలయం కార్యనిర్వహణాధికారి ఉప్పల శశిధర్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ భవనం వెనుక గల సర్వే నెంబర్ 338లో 6.02 గుంటల భూమి పట్టణంలోని రామాలయం-శివాలయానికి చెందినదని, ఈ భూమిని ఎవరైనా ఆక్రమించాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ మేరకు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఆయనవెంట దేవాదాయ శాఖ సిబ్బంది నరసింహారెడ్డి, రవిందర్ తదితరులున్నారు.

పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐగా మల్లేష్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 14: పోలీస్ కంట్రోల్ రూమ్ నూతన సీఐగా మల్లేష్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ డాక్టర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అభినందించి, పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఎల్లవేళలా అందుబాటులో ఉండి, వచ్చే ప్రతి ఫోన్‌కాల్‌కు ప్రజలతో మర్యాదగా మాట్లాడి, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

కేసీఆర్‌ను కలిసిన సంతోష్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 14: జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ వింగ్ జిల్లా నాయకుడు ఆలేటి సంతోష్‌రెడ్డి బుధవారం మాజీ సీఎంకేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే మాజీ మంత్రి కేటీఆర్, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిలను కలిశారు. తన పుట్టినరోజు సందర్భంగా వారిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

చేర్యాల, ఆగస్టు 14: చేర్యాల పీఏసీఎస్ చైర్మన్‌గా మేరుగు కృష్ణ, వైస్ చైర్మన్‌గా వెలుగల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గత పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ తాళ్లపల్లి నర్సయ్యలపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం ఇటీవల నెగ్గిన క్రమంలో బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఇరువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా వీరి పదవీకాలం వచ్చే ఫిబ్రవరిలో ముగియనుంది. అనంతరం ఇరువురితో పాటు డైరెక్టర్లంతా కలిసి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

- నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



ఎస్సీ కమ్యూనిటీహాల్‌కు బోరుమోటార్‌ను అందజేస్తున్న చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, ఆగస్టు 14: మారుమూల గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం తొగుట మండలం లింగాపూర్, తుక్కాపూర్, గుడికందుల గ్రామాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లింగాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీహాల్, మహిళా బిల్డింగ్‌కు బోరుమోటార్ కావాలని, అలాగే వీధిలైట్లు కావాలని ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి వాటిని అందజేశారు. తుక్కాపూర్‌లోని కాశగుడిసెల్లో తాగునీటి అవసరాల కోసం రూ.30 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గుడికందుల గ్రామానికి రోడ్డు సరిగాలేక ఇబ్బందుల పడుతున్నామని గ్రామస్థులు చెప్పడంతో.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అభివృద్ధి పనులను పూర్తి చేసుకుందామని వారికి హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు కనకయ్య, కిషన్, స్వామి గణేష్, నరేష్, మల్లయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

జవాన్ల తల్లిదండ్రులకు సన్మానం

నంగునూరు, ఆగస్టు 14: దేశ రక్షణ కోసం తమ పిల్లలను సైనికులుగా పంపిన తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి పౌరుడు బాధ్యతగా స్వీకరించాలని బీజేపీ ఆర్మీ సెల్ మాజీ జిల్లా కన్వీనర్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రం అన్నారు. సైనికులుగా సరిహద్దుల్లో పనిచేస్తున్న నంగునూరు మండలం మగ్ధుంపూర్ గ్రామానికి చెందిన నలుగురు యువకుల తల్లిదండ్రులను బుధవారం బీజేపీ ఆర్మీ సెల్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆజాద్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షఫీ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

మద్దూరు, ఆగస్టు 14: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఎస్.రామ్మోహన్ సూచించారు. బుధవారం మండలంలోని కమలాయపల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించి, మాట్లాడారు. వీధుల్లో నీళ్లు నిలువ లేకుండా చూడాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని సూచించారు. ప్రతి కుటుంబం ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను తెలంగాణకు తీసుకురావడం సంతోషం

సిద్దిపేట టౌన్, ఆగస్టు 14: రాష్ట్ర విభజనలో భాగంగా తెలంగాణలో పనిచేస్తున్న ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించామని, తద్వారా పదేళ్ల తర్వాత 122 మంది ఉద్యోగులను తిరిగి తెలంగాణకు కేటాయించడం హర్షించదగిన విషయమని టీఎన్జీవోస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డి తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగులందరూ తెలంగాణలో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విన్నవించిన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్‌హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చేర్యాలలో 2కే రన్

చేర్యాల, ఆగస్టు 14: యువత మత్తు పదార్థాలకు బానిసకావొద్దని అవగాహన కల్పిస్తూ చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 2కే రన్ నిర్వహించారు. కళాశాలలో సీఐ ఎల్.శ్రీను జెండా ఊపి 2కే రన్ ప్రారంభించారు. ఎస్‌ఐ నీరేశ్, ప్రిన్సిపల్ జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ అవయం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్కులు, స్టేషనరీని, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిక్షనరీలను ట్రస్ట్ డైరెక్టర్ సురేశ్‌కుమార్, సభ్యుడు దూబే, శ్రీకాంత్ పంపిణీ చేశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల పట్ల నిరసన

తొగుట/మిరుదొడ్డి/కొండపాక, ఆగస్టు 14: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం తొగుటలో వ్యాపారులు స్వచ్ఛందంగా వాణిజ్య, వ్యాపార దుకాణాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. హిందువులపై దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. అలాగే మిరుదొడ్డిలో బీజేపీ నాయకులు బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు దేవరాజు మాట్లాడారు. కొండపాక మండలంలో బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. మండలంలోని దుద్దెడ, వెలికట్ట తదితర గ్రామాల్లో వ్యాపార సంస్థలను మూసివేయించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 14: ముందస్తు రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా సిద్దిపేట పట్టణం శివాజీ నగర్‌లోని బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో పోలీసులకు, సబ్ జైల్లోని ఖైదీలకు, ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులకు, ప్రతిభా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్‌కు, ఉపాధ్యాయులకు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి బీకే.స్రవంతి, సంస్థ సభ్యులు వెంకటేశం, బాలు, రేణుక, భవాని పాల్గొన్నారు.

బాలుర ఎడ్యుకేషన్ హబ్‌కు వాచ్‌మన్‌ను నియమించాలి

గజ్వేల్, ఆగస్టు 14: బాలుర ఎడ్యుకేషన్ హబ్‌కు వాచ్‌మన్‌ను నియమించాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నాచారం శేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు యూఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడార.

హుస్నాబాద్‌లో భారీ జాతీయ పతాకంతో ర్యాలీ



హుస్నాబాద్‌లో భారీ జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ

హుస్నాబాద్ టౌన్/కోహెడ, ఆగస్టు 1: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం హుస్నాబాద్ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో భారీ జాతీయ పతాకంతో పట్టణంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మహనీయుల త్యాగఫలితమే స్వాతంత్ర్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కొండ్లె వాసుదేవరెడ్డి, పంజ రాజమల్లు, సువర్ణలీల పాల్గొన్నారు. కోహెడ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం నేతృత్వంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సాయిబాబా కమాన్ నుంచి షేర్ బజార్, రామాలయం, పాత బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, ప్రధాన కార్యదర్శులు పిల్లి నర్సయ్య, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు రాంచంద్రరెడ్డి, దళిత మోర్చా మండలాధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.